నాలాలపై పట్టింపేది..?

లోతట్టు ప్రాంతాల్లో అభివృద్ధి చేయడంపై నిర్లక్ష్యం

- ఏటా వర్షాకాలంలో బస్తీవాసులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అల్విన్‌కాలనీ ధరణినగర్ వద్ద మధ్యలోనే ఆగిపోయిన నాలా ప్రహరీ నిర్మాణం



ధరణినగర్ వద్ద సగం వరకే చేపట్టిన ప్రహరీ

కూకట్‌పల్లి:

నాలా పరీవాహక ప్రాంతాల్లోని బస్తీవాసులకు ఈ వర్షాకాలంలోనూ తిప్పలు తప్పేలా లేవు. నాలాల పునరుద్ధరణ, అభివృద్ధి చేస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 3 నాలాలు 18 కిలోమీటర్ల మేర ఆవరించి ఉన్నాయి. ప్రధానమైనది పరికి చెరువు నాలా ఆల్విన్‌కాలనీ సమీపంలోని పరికి చెరువు మత్తడి నుంచి ప్రారంభమవుతుంది. ఈ చెరువు ప్రాంతంలోని నాలా మొదట్లో 54 అడుగులు ప్రారంభంలోనే ఉండేది. తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు దశాబ్ద కాలం క్రితం 54 అడుగులుగా నాలాను గుర్తించి మార్కింగ్ చేశారు. ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపడితే సహించేది లేదని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. ఆ నాలా 100 మీటర్లకు 10 అడుగులను పెంచుతూ నాలా వెడల్పును హుస్సేన్‌సాగర్ వరకు విశాలంగా నాలా ఉండేలా రూపొందించారు. కాగాతాల్లోనే రూపుదిద్దుకున్న ఈ నాలా స్వరూపం మరో 5 ఏడేళ్లకు 36 అడగులకు చేరింది. నాలా ప్రాంతంలో మిగిలిన భాగమంతా నిర్మాణాలు జరిగాయి. ఐదేళ్ల క్రితం వర్షాకాలంలో నాలాలు పొంగి బస్తీలు మునుగుతున్నా ధరణినగర్, ఆల్విన్‌కాలనీ, షిర్డీ నగర్, సాయినగర్, చక్రధర్‌కాలనీ, దీనబంధునగర్, శ్రీశ్రీ నగర్, దీన్‌దయాల్ నగర్, ఏవీబీ పురం, రాజీవ్ గాంధీనగర్ ప్రాంతాలకు ప్రహరీని నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం సుమారు రూ. 200 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. మొదటి దశగా పరికి చెరువు నాలా మత్తడి నుంచి 500 మీటర్ల వరకు సుమారు రూ. 5.50 కోట్లతో టెండర్లు వేసి నాలా ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ఆల్విన్‌కాలనీలోని ఓ నిర్మాణదారుడు తనకు ప్రభుత్వం కేటాయించిన ఫ్లాట్ నాలాలోకి వెళ్తుందని తనకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో 100 మీటర్ల వరకు నిర్మాణం చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు మార్గమధ్యలోనే పనులు నిలిపేశారు. కొంతమంది కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు సదరు నిర్మాణదారుడిని ఒప్పించి కేసు వాపస్ తీసుకునేలా ప్రయత్నించారు. అనంతరం కాంట్రాక్టర్ తన సమయం గడిచిపోయిందని ఆపివేశాడు. తర్వాత టెండర్‌లో పాల్గొన్న కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటు కావడం లేదని నాలా ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టకుండానే వెళ్లాడు. అప్పటి నుంచి పనులు అలాగే నిలిచిపోయాయి. ఇదిలాఉండగా కూకట్‌పల్లిలో మరో ప్రధాన నాలా అయిన కేపీహెచ్‌బీ నుంచి రంగధాముని చెరువు మీదుగా హుస్సేన్‌సాగర్ నాలాకు వెళ్లే ఈ మార్గాలు పూర్తిగా కుచించుకుపోయాయి. కేపీహెచ్‌బీలో నాలాల మీదే నిర్మాణాలు చేపట్టడంతో ఇక్కడ వరదనీరు రోజుల తరబడి రోడ్లపైనే నిలిచి ఉంటోంది. మరో నాలా ఫాక్స్‌సాగర్ నాలాను కాపాడే వారే లేరు. ఇప్పటికే నాలా సగానికి పైగా కుచించుకుపోగా నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే సమీపంలోని చెరబండ రాజునగర్, వినాయకనగర్, నవజీవన్‌నగర్, నాగార్జున నగర్, ఫతేనగర్ ప్రాంతాల్లో ఇళ్లల్లో చేపలు పట్టడం, రోడ్లపై పడవలు తిప్పటం ఏటా పరిపాటిగా మారింది. నాలాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంలో అధికారులు ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతోనే ఏటా తిప్పలు తప్పడం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సత్వర చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నాయకులు, అధికారులు నాలాల గురించి మాట్లాడడమే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదు. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు రాకుండా చర్యలు తీసుకుంటామని పాలకులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాలను విస్తరించి ప్రహరీలు నిర్మిస్తే ఇళ్లలోకి వరద రాకుండా ఉంటుంది.

–జి. సమ్మారెడ్డి, ఆల్విన్‌కాలనీ సంక్షేమ సంఘం మాజీ కార్యదర్శి

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో పైపులైన్ పగిలి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. ఈ విషయమై కాలనీ వాసులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి అధికారులతో కలిసి గురువారం కాలనీలో పర్యటించి పరిశీలించారు. సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ నరేంద్ర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో అసోసియేషన్ కమిటీ అభినందన సభ



సభలో జూడో నూతన కమిటీ సభ్యులు తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లిలోని రిషి ఇంజినీరింగ్ కళాశాలలో ఆ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ రాజశ్రీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కమిటీ అభినందన సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది సుధాకర్ రావు హాజరై మాట్లాడుతూ.. జూడో క్రీడాభివృద్ధికి, తెలంగాణ జూడో సంఘం బాధ్యుల సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లాలో రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలు నిర్వహణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాష్ట్ర జూడో అధ్యక్షుడు కైలాష్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు వేయడంతో పాటు జూడో క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అజీజ్ ఫారూఖీ, కోశాధికారి ఎంఎస్ రవీందర్, ఉపాధ్యక్షుడు డా. రామ్ లక్ష్మణ్, జెల్లెల శ్రీనివాస్‌రావు, రమాదేవి, సంయుక్త కార్యదర్శి దుపాకి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం సాధ్యమే



సైంటిస్ట్ డాక్టర్ ఆనంద్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు

- కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.ఆనంద్
- 'ఎస్కీ' క్యాంపస్‌లో 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్' థీమ్‌పై ప్రత్యేక సమావేశం

రాయదుర్గం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం సాధ్యమేనని, సర్క్యులర్ ఎకానమీ విధానంలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్‌తో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో గురువారం 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'ఎండింగ్ పొల్యూషన్ థీమ్‌పై ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రష్యా కామన్వెల్త్, జపాన్ దేశాల్లో కేవలం నాలుగు శాతం మాత్రమే ప్లాస్టిక్ వినియోగం ఉందని వివరించారు.

నగరంలోని చెత్తలో 60 నుంచి 70 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తులే

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్

కేంద్రం 2020 లో సింగిల్ ప్లాస్టిక్ యూసేజీను నిషేధించినప్పటికీ ఆయా వస్తువులు ఇంకా మార్కెట్‌లోకి వస్తూనే ఉన్నాయని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ పేర్కొన్నారు. నగరంలో రోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు 6,500 మెట్రిక్ టన్నుల చెత్తలో 60 నుంచి 70 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తులే ఉంటున్నాయని, వీటిలో అధికంగా ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ సీసాలతో పాటుగా, ప్లాస్టిక్ కవర్లు ఉన్నాయన్నారు. ఈ కవర్లను పశువులు తిని అనారోగ్యంతో చనిపోతున్నాయన్నారు. రోజువారి అవసరాలకు కాటన్ సంచులు స్టీల్ పాత్రలు వాడాలని సూచించారు.

ప్రపంచానికే పెను సవాల్‌గా ప్లాస్టిక్

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర రావు

ప్లాస్టిక్ పెనుభూతం ప్రస్తుతం భూమిమీదనే కాదు, అంతరిక్షంలోనూ, సముద్రాల లోతుల్లో కూడా విపత్తు సంభవించి ప్రపంచానికి పెను సవాల్‌గా మారిందని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో ప్రతీ కదలికలో ప్లాస్టిక్ వినియోగం ఉంటున్నదన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సిహెచ్ రంగారావు ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానంపై ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్రీనాథ్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ డాక్టర్ నరేష్, నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

హెచ్‌సీయూలో..

రాయదుర్గం: ప్రపంచ స్థాయిలో ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై మరింత అవగాహన కల్పించాలని ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేష్ జొన్నలగడ్డ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఈపీటీఆర్ఐ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ప్రతిఒక్కరూ పూర్తిగా సహకరించాలన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులతో లబ్ధిదారులు, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్ల పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చంద్రమోహన్‌సాగర్, చిరుమర్తి రాజు, విమల, స్వప్న, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన



రాజేశ్వరరావును సన్మానించిన సభ్యులు

కూకట్‌పల్లి: మూసాపేటలో పోచమ్మ, ఎల్లమ్మ, బంగారు మైసమ్మ, ముత్యాలమ్మ, ఉప్పలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. అర్చకులు, ఒగ్గుడోలు గురువులు వేద మంత్రోచ్ఛారణలతో ఆయనను ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి వడ్డేపల్లి రాజేశ్వరరావు రూ. 5 లక్షలను విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

వార్షిక మహోత్సవ పూజలు



పాల్గొన్న బండి రమేశ్ తదితరులు

మోతీనగర్: భూనీళ సమేత వేంకటేశ్వర స్వామి 13వ వార్షిక మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ హాజరై పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షుడు మోయినుద్దీన్, నరసింహ యాదవ్, మస్తాన్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవి ముదిరాజ్, సతీశ్‌రెడ్డి, ధర్మారావు పాల్గొన్నారు.

8న సాంస్కృతిక కార్యక్రమాలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శృంగేరి శంకర మఠం ఆవరణలో ఈనెల 8న సాయంత్రం 5 గంటలకు శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం, శ్రీ కృష్ణరాయబారం పౌరాణిక పద్య నాటకం నుంచి పాండవుల ఘట్టం వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. శ్రీ రాముడిగా నంది, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత సాయిలక్ష్మీ చాగంటి, ఆంజనేయుడిగా వీణ అవార్డు గ్రహీత బి. లక్ష్మీ శ్రీరామ్, శ్రీకృష్ణుడిగా ప్రఖ్యాత పౌరాణిక నటుడు బి.వి. కాంటంరాజు, భీముడిగా నాటక నట సార్వభౌముడు మహానంది అవార్డు గ్రహీత పుచ్చా సాంబశివారెడ్డి, ఇతర నటీనటులు నటించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రఖ్యాత పౌరాణిక సీనియర్ నటుడు కుందుర్తి వెంకట కృష్ణ హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

17వ అంతస్తు పైనుంచి పడి యువకుడి మృతి

గచ్చిబౌలి: ఇంటీరియర్ పనులు చేస్తూ 17వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూల్ జిల్లా ఆదోని మండలం బల్లెకల్లు గ్రామానికి చెందిన బొయ తలారి హన్మంత్(21) ఫిల్మ్‌నగర్‌లో నివాసం ఉంటూ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ ఇంటిరీయర్స్ వద్ద పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో పనిచేస్తూ 17వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది గంటల్లోనే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న పీసీసీ సెక్రటరీ యాదగిరి దంపతులు



పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని హస్మత్‌పేట చౌరస్తాలో గల దుర్గామాత, పరమేశ్వర సమేత రేణుకా ఎల్లమ్మ ఆలయం ముఖద్వార ప్రారంభోత్సవాన్ని టీపీసీసీ కార్యదర్శి దండువుల యాదగిరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ మల్లికార్జున యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు రాజేందర్, అస్లాం, కేపీహెచ్‌బీ ప్రెసిడెంట్ ప్రవీణ్ , రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్, నాయకులు షాహెన్నా, కనకరాజు, సందీప్, కిరణ్ గౌడ్, దండగుల అమూల్య , విజయలక్ష్మి, రమాదేవి, ప్రగతి, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ప్రేమ విఫలమై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..అసోం రాష్ట్రంలోని మల్లెగూడెం మండలం సింగయ్య గ్రామానికి చెందిన రాజీబ్ బోడ (41) బతుకుదెరువు కోసం 11 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి సుచిత్ర వెన్నెలగడ్డలో ఉంటున్నాడు. సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించే రాజీబ్ ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే అతనికి గతంలో విడాకులు అయినట్లు తెలుసుకున్న సదరు యువతి ప్రేమను నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన అతని ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణా శిబిరం



వీసీ ఐనుల్ హసన్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న కల్నల్ రవీంద్రరావు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 11 ఆర్టిలరీ బ్యాటరీ హైదరాబాద్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పది రోజుల వార్షిక ఎన్‌సీసీ శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రరావు ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధాల నిర్వహణ, షూటింగ్, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా గురువు బి లోకేశ్వర్‌రావు యోగా సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొ.అజీమ్, డాక్టర్ మహతిప్రియదర్శిని, వేణుగోపాలరావు, అనిల్, ఎంఏ ముజీం తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో సుమారు రూ.1.60 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్పొరేటర్లు పూజిత గౌడ్, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాతృశ్రీనగర్, జనప్రియనగర్, రామకృష్ణనగర్ ప్రాంతాలలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేపడతామన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో రూ.40 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జనప్రియనగర్ ఫేజ్–2లో రూ.85 లక్షలు, రామకృష్ణనగర్, ప్రజయ్‌సిటీ కాలనీలలో రూ.35 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం అమీరుద్దీన్, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



వివేకానందనగర్‌లో మొక్కలు నాటిన మాధవరం కాంతారావు, వంశీరెడ్డి

ఆల్విన్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి డివిజన్‌లో ఆయన మొక్కలు నాటారు. అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, అర్శనపల్లి సూర్యారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, డివిజన్ నాయకులు ఈరంటి సాయికుమార్ పాల్గొన్నారు. బీజేపీ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆధ్వర్యంలో..

వివేకానందనగర్ బీజేపీ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేశ్, బీజేపీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి రంగారావు, బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆస్‌బెస్టాస్ కాలనీలో..

ఆస్‌బెస్టాస్ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు పంతం బాలూయాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభారి లాంగట్టి నరేందర్‌రెడ్డి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు ఏ. భూపాల రెడ్డి, గంగుల రాజిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సుధాకర్, సంపత్‌కుమార్, శ్రీలత, సంధ్య, అరుణ పాల్గొన్నారు.

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గ్రౌండ్‌లో..

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లోని డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గ్రౌండ్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వినోద్ కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణు, శేఖర్, గణేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ అన్నెం కోటి రెడ్డి పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీలో మందారపు మొక్కను నాటారు. కార్యక్రమంలో రామ్‌చందర్, శేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో మొక్కలు నాటుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు



మొక్కలు నాటిన వినోద్ కుమార్ గౌడ్, బీజేపీ నాయకులు